క్లుప్తంగా

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి



ఫిజియోథెరపీ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: స్థానిక భవిత కేంద్రంలో ప్రతి సోమవారం అంగవైకల్యం కలిగిన పిల్లలకు నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి సుభాన్ కోరారు. సోమవారం భవిత కేంద్రంలో ప్రారంభించిన ఫిజియోథెరపీ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులతో ఎంఈఓ మాట్లాడుతూ కేంద్రానికి పిల్లలను తీసుకొచ్చే పిల్లలకు రవాణా భత్యాలను ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. ప్రతి రోజు సాధన చేయడంతో నరాలు బలం పొందుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు కృష్ణప్రియ, ఐఈఆర్‌టీలు రామకృష్ణయ్య, అరుణకుమారి తదితరులు ఉన్నారు.

నేడు ప్రాతకోటలో 'జగనన్న సురక్ష'

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం – 2 సచివాలయం పరిధిలోని పడమర ప్రాతకోటలో మంగళవారం ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

నేడు ఎమ్మెల్యే శిల్పా పర్యటన

ఆత్మకూరు: ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మంగళవారం మండలం, పట్టణంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కురుకుంద గ్రామంలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ కాలనీలోని జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పవన్‌కుమార్

ఆత్మకూరు: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు.మండలంలోని నల్లకాల్వ గ్రామంలో సోమవారం డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమల వలన డెంగీ, మలేరియా, విషజ్వరాలు సోకుతున్నాయన్నారు. తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వృథాగా ఉన్న కొబ్బరిబోండాలు, కుండలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, శివకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ స్థలాన్ని కాపాడండి

నందికొట్కూరు: మున్సిపాలిటీ స్థలాన్ని కాపాడాలని వాల్మీకి సంఘం నాయకులు స్వాములు, నాగేశ్వరరావు, శేఖర్ కోరారు. స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్ బాబుకు, మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు వాల్మీకి సంఘం నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ స్థలం కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 354ఏ–2 సర్వే నంబరు గల భూమిలో పబ్లిక్ మరుగుదొడ్డి వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలానికి తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి రిజిష్టర్ చేయించుకున్నారని చెప్పారు. స్థలం కబ్జా నుంచి కాపాడి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, కృష్ణ, ఉపేంద్ర, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ను నియమించండి

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు డాక్టర్‌ను నియమించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియ్యా కోరారు. సోమవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద బదిలీపై వెళ్లిన డాక్టర్ స్థానంలో మరో డాక్టర్‌ను తక్షణమే నియమించాలంటూ దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గత నెలలో జరిగిన బదిలీలో భాగంగా డాక్టర్ బదిలీపై వెళ్లితే ఆ స్థానంలో జిల్లా అధికారులు మరొకరిని ఎందుకు నియమించలేదన్నారు. పట్టణ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చూర్‌బీ, లక్ష్మీదేవి, రాధమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఇక నకిలీల ఆటకట్టు!

- విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షించేందుకు డాక్టర్ వైఎస్సార్ అగ్రిల్యాబ్ ఏర్పాటు
- ఆత్మకూరు పట్టణంలో రూ.80 లక్షలతో నిర్మాణం
- ఈనెల 13న ప్రారంభోత్సవానికి సిద్ధం

ఆత్మకూరు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు, మందులు సబ్సిడీపై అందించడంతో పాటు ధాన్యం కొనగోలు, పంట బీమా, పంట నష్ట పరిహారం ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. రైతులను నకిలీల బెడద నుంచి కాపాడేందుకు డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆత్మకూరు పట్టణంలో అగ్రిల్యాబ్ ను రూ.80 లక్షల నిధులు మంజూరు చేయగా నూతన భవన నిర్మాణం పూర్తయ్యింది.ఈనెల 13న ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

ఉచితంగా ఎరువులు, విత్తనాల పరీక్షలు

ప్రతి ఏడాది నాణ్యతలేని విత్తనాలు, ఎరువులతో పంట దిగుబడి లేక రైతులు అప్పుల పాలవుతున్నారు. దుకాణ యజమానులు ఇచ్చిన వాటినే తీసుకుని పంటలు పండించేవారు. ఇకపై అన్నదాతలు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను నెలకొల్పింది. ఈ ల్యాబ్‌లు ప్రారంభమైతే కర్షకులే స్వయంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు ఉచితంగానే చేయించుకోవచ్చు. విత్తనాల్లో



ఆత్మకూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్

మొలక శాతం, భౌతిక స్వచ్ఛత, తేమ శాతంతో పాటు ఎరువుల్లో నత్రజని, పాస్పరస్, పొటాష్, కాంప్లెక్స్, యూరియా, ఎన్‌పీకే మిక్సింగ్, సూక్ష్మ పోషకాలు, సరైన మోతాదులో ఉన్నాయా..లేదా అనేది తెలుసుకునే వీలుంటుంది.

నేరుగా పరీక్షలు చేయించుకునే అవకాశం

ఖరీఫ్ ప్రారంభంలో రైతులు సాగు చేసే విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, భూసార పరీక్షల కోసం రైతులు నమూనాలను ఆర్బీకే సిబ్బందికి లేదా స్వయంగా వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లకు అందించవచ్చు. వీరు వేగవంతంగా పరీక్షలు నిర్వహించేందుకు నియోజకవర్గం కేంద్రాలతో పాటు ప్రాంతీయ ఫోడింగ్ సెంటర్లయిన అమరావతి, తిరుపతి, తాడేపల్లిగూడెం, విశాఖ పట్టణాలకు కూడా పంపి టెస్టులు నిర్వహించి త్వరగా ఫలితాలు అందజేస్తారు. ఇందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇదే పరీక్షలు వ్యాపారులు, దుకాణ యజమానులకు నిర్వహించుకోవాలంటే నిర్ణీత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ఈనెల 13న ప్రారంభోత్సవం

దివంగత నేత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి జయంతి, వైఎస్సార్ రైతు దినోత్సవం సందర్భంగా పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ఈ నెల 13వ తేదీన ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ప్రారంభించి రైతులకు కానుకగా ఇవ్వనున్నారు. గతంలో పత్తి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మిర్చి, పంటల్లో నాణ్యమైన విత్తనాలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ల్యాబ్ ఏర్పాటుతో రైతులకు నకిలీ విత్తనాల బెడద నుంచి విముక్తి లభించనుంది.

త్వరగా ఫలితాలు అందిస్తాం



రైతులు అందించే విత్తనాలు, ఎరువులు, మందులకు ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తాం. ఈ పరీక్షల ఫలితాలను త్వరగానే అందిస్తాం. దీంతో రైతులు వాటిని ఉపయోగించాలా... వద్దా నిర్ధారించుకోవచ్చు. ప్రతి రైతుకు ఈ కేంద్రాలు ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి.

– వెంకటనారాయణ, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్ విశ్లేషకులు, ఆత్మకూరు

రైతులు స్వయంగా పరీక్షించుకోవచ్చు



రైతులు పంటసాగు చేసే సమయంలో అవి మంచి విత్తనాలా... కాదా తెలుసుకునేందుకు ల్యాబ్‌కు స్వయంగా వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చు. ఖరీఫ్‌లో సాగు చేసే మొక్కజొన్న, కంది, వరి పంటలతో పాటు రబీ సీజన్‌లో సాగు చేసే మినుము, పొద్దుతిరుగుడు, వేసుశనగ, పంటలతో పాటు మిర్చి లాంటి ఉద్యాన పంటల విత్తనాలు కూడా ఈ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు వీలుంది.

– విష్ణువర్ధన్‌రెడ్డి , మండల వ్యవసాయాధికారి , ఆత్మకూరు

రైతులకు ఎంతగానో ఉపయోగం



రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రారంభించనున్న డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు రైతులు విత్తనాలు,ఎరువులు ఏమి మంచివో, చెడ్డవో నిర్ధారించుకోలేక ఇబ్బంది పడ్డారు. ఈ నెల 8 వ తేదీన ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి చేతుల మీదుగా అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు ప్రారంభం కానుంది. దీంతో రైతుకు ఇక నుంచి నకిలీల బారిన పడకుండా నివారించవచ్చు.

– ఏడీఏ ఆంజనేయులు ,ఆత్మకూరు

ఎంతో సంతోషంగా ఉంది



ఆత్మకూరులో వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ప్రారంభించడం సంతోషంగా ఉంది. విత్తనాలు, ఎరువులపై అనుమానం వస్తే వాటిని ఈ ల్యాబ్ ద్వారా పరీక్షలు నిర్వహించుకోవచ్చు, 7 రోజుల్లోనే విత్తనాలు మంచివా చెడ్డవా అని వ్యవసాయాధికారులు ఫలితాలు అందిస్తారు. దీంతో నకిలీ విత్తనాలు వేసి నష్టపోకుండా నివారించవచ్చు. ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– భూస్వామి, రైతు సిద్ధపల్లి

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



పురుగు మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న 4,510 కేజీల విషపు గుళికల విక్రయాలు నిలిపి వేసినట్లు ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. సోమవారం మండలంలోని క్రిష్టారావుపేట, తుమ్మలూరు, పాములపాడు గ్రామాల్లోని పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్రిష్టారావు పేట శ్రీనివాస ట్రేడర్స్‌లో కిసాన్ బయో ఫార్ములేషన్ కంపెనీకి సంబంధించిన కోబ్రా 400 ప్యాకెట్లు, గ్రానైలర్ 115 ప్యాకెట్లు, పాములపాడు భాగ్యలక్ష్మి ట్రేడర్స్‌లో కోబ్రా 197 ప్యాకెట్లు, అంజనా ట్రేడర్స్ 190 ప్యాకెట్లను అమ్మరాదని ఆదేశించారు. ఒక్కో ప్యాకెట్ 5 కేజీల చొప్పున గుళికలు ఉన్నాయి. ఆ కంపెనీలపై అనుమానం ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రయోగశాలకు పంపిస్తున్నటుల్ చెప్పారు. వీటి విలువ దాదాపు రూ.9,01,098 ఉంటుందని వివరించారు. నిబంధనల మేరకు ఫలితాలు రాకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఏఓ ఫణీశ్వరరెడ్డి ఉన్నారు.

గ్రామీణ విద్యార్థులకు చేయూత

మహానంది: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దాతలు చేయూత అందిస్తున్నారని మండల విద్యాశాఖాధికారులు యశోద, మోహన్‌రెడ్డి తెలిపారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ నాగలూటి నారాయణ ఆయన కుమారుడు శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా ఆయ న మిత్రుల సహకారంతో బండిఆత్మకూరు మండలంలోని నాలుగు ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రిని సోమవారం అందించారు. వెంకటరాముడు, లక్ష్మణస్వామి, నారాయణ, ఆర్‌ఐ చిన్న వెంకటరాముడు సహకరించడంతో అధికారులు అభినందించారు.

మల్లన్నను దర్శించుకున్న ఉత్తరప్రదేశ్ మంత్రి



ఆలయ ప్రాంగణంలో మంత్రి అనిల్‌రాజ్‌భర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను సోమవారం ఉత్తరప్రదేశ్ గ్రామిక ఉపాధి శాఖ మంత్రి అనిల్‌రాజ్‌భర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. అలాగే పంజాబ్ ఫుడ్‌కమిషన్ చైర్మన్ డీపీ రెడ్డి సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పట్టాలకు స్థలాలు ఇవ్వాలి

కొత్తపల్లి: గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు ఇవ్వాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎస్ రంగనాయుడు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే రాధాకృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు లబ్ధిదారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2004 సంవత్సరంలో కొత్తపల్లి గ్రామంలో నిరుపేద దళితులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతులకు చెందిన 300 మందికి ఒక్కొక్కరికి 3 సెంట్లు చొప్పున పట్టాలు పంపిణీ చేశారన్నారు. కానీ వారికి స్థలం చూపించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఆ స్థలం నేటికీ అట్లానే ఉంది కానీ లబ్ధిదారులకి పంపిణీ చేయలేదని, ప్రభుత్వం స్పందించి వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. అనంతరం స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్రశేఖర్, సురేష్, భీమలింగం, ముత్తు, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతాం

కొత్తపల్లి: స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం మండల స్థాయి అధికారులతో కలసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 11 మంది వారి సమస్యలు పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారన్నారు.

స్పందనలో 3 అర్జీలు

పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ప్రజల నుంచి 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. మద్దూరు గ్రామంలో రస్తా విషయంలో సర్వే చేయాలని కోరుతూ, వానాల గ్రామంలో పొలాల సమస్యల పై 2 చొప్పున అర్జీలు వచ్చాయన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు రాలేదు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీకృష్ణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా అధికారులు హాజరు

జూపాడుబంగ్లా: సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అధికారులు అరకొరగా హాజరవ్వటంతో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలో 26శాఖల అధికారులుండగా కేవలం 8 శాఖల అధికారులు మాత్రమే కార్యక్రమానికి హాజరయ్యారు. కొంత మంది స్పందన కార్యక్రమానికి నిరంతరంగా గైర్హాజరవుతుండగా మరికొంత మంది అధికారులు హాజరుపట్టికలో సంతకం చేసి స్పందన కార్యక్రమం నుంచి నిష్క్రమిస్తున్నారు. ఇంకొందరు అధికారులు వారు హాజరుకాకుండా కిందిస్థాయి ఉద్యోగులను స్పందన కార్యక్రమానికి పంపిస్తుండటంతో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటునిస్తాం



మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ పవన్‌కుమార్

కొత్తపల్లి: గిరిజనుల అభివృద్ధికి స్టేట్ బ్యాంకు ద్వారా ప్రభుత్వం తోడ్పాటు నిస్తుందని బ్యాంకు మేనేజర్ పవన్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక గిరి భారతి మండల సమాఖ్య కార్యాలయంలో గిరిజన పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళలు బ్యాంకు ద్వారా పొందిన రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తే మరలా ఎక్కువ రుణాలు ఇచ్చేందుకు ఎస్‌బీఐ ముందుంటుందన్నారు. గిరిజనులకు బ్యాంకు లింకేజీ, ఇతర జీవనోపాధులకు, విద్యకు లోన్లు అందిస్తామని చెప్పారు. అదేవిధంగా ఇన్సూరెన్స్ కార్యక్రమంలో కూడా భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం గిరిజన మహిళలు తయారు చేసిన షర్బత్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీసీలు యూసుఫ్, స్వాములు, ఓబీలు బయమ్మ, చిట్టెమ్మ, గువ్వమ్మ, వీరమ్మ పాల్గొన్నారు.

పట్టు వదలని రైతు



విత్తనం నాటిన పొలంలో పండ్ల గొర్రుతో సేద్యం చేస్తున్న రైతు

పాములపాడు: ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన కొద్దిపాటి వర్షానికే రైతులు మొక్కజొన్న విత్తనాలు నాటారు. అయితే రెండు రోజులకు భారీ వర్షం కురవడం ఆ తర్వాత వరుణుడు మొఖం చాటేశాడు. సాధారణంగా విత్తనం నాటిన 6 రోజులకు మొలకెత్తుతుంది. భారీ వర్షం వల్ల భూమి గట్టి పడటంతో విత్తనం మొలకెత్తి భూమి లోపలి నుంచి బయటకు రావడానికి ఇబ్బందిగా మారింది. మొలకలు పొలంలో కానరాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా విత్తనం మొలకెత్తలేదని పొలాల్లో పండ్ల గొర్రుతో మలి సేద్యం చేస్తున్నారు. ఇలా చేయడంతో భూమి వదులుగా అవుతుంది. మొలకెత్తిన మొక్కలు సులువుగా బయటకు వస్తాయి. ఇప్పటికే కొందరు రైతులు ఈ విధానంతో మంచి ఫలితాలు రావడంతో మిగతా రైతులు అదే బాటలో వెళ్తున్నారు.

గడప గడపకు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ప్రజాసంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యం
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



అవ్వతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు రూరల్ : గడప గడపకు సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మండలంలోని నాగటూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెవుల సుజాత, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీవో శోభారాణి, సింగిల్ విండో చైర్మన్ సగినేల వృశేనయ్య, కొణిదేల సర్పంచి నవీన్, కౌన్సిలర్లు జాకీర్‌హుసేన్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీం



బాధితులతో మాట్లాడుతున్న డాక్టర్ల బృందం

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో అతిసారం నియంత్రణకు ప్రత్యేక టీమ్‌ను నియమించినట్లు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు గ్రామంలో అతిసారం ఉధృతిపై వివరాలు సేకరించారు. అతిసార సోకిన వారి ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీమ్ ఎస్‌పీఎం డాక్టర్ విజయకుమారి, పీడీయాట్రిషియన్ డాక్టర్ అరుణజ్యోతి, మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ సచిన్ సుమంత్, జనరల్ ఫిజీషియన్లు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కొమ్మా మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెద్దదేవళాపురం, అబ్బీపురం గ్రామాల్లో కార్యక్రమాలు ఉంటాయన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారని చెప్పారు.

మిట్టకందాలలో..

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపీడీఓ గోపీక్రిష్ణ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోనే అందుబాటులో ఉంటారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందించడం జరుగుతుందని వివరించారు.

తంగడంచలో..

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో మంగళవారం సర్పంచ్ ఈదుల ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వలంటీర్లను కించపరచడం బాధాకరం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను జనసేన పార్టీ అధినేత పవనకల్యాణ్ కించపరచడం బాధాకరమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్న వలంటీర్లపై నోటికి వచ్చినట్లు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సంక్షేమ సారధులపై పవన్ ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని తేల్చి చెప్పారు. పవన్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలను ఒక పైసా తీసుకోకుండా ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్లపై గాలికి తిరిగే పవన్ దురుసుగా మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పవన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.సమావేశంలో కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై ఆరోపణలు చేయడం తగదు

జూపాడుబంగ్లా: నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అసత్య ఆరోపణలు చేయడం తగదని జూపాడుబంగ్లా జేసీఎస్ మండల అధ్యక్షుడు, పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు దత్తపుత్రుడిగా పేరొందిన పవన్‌కల్యాణ్ తప్పుడు మార్గంలో నడుస్తున్నాడని, అలాగే అందరూ తప్పుడు వారని పేర్కొనడం ఆయన నీచరాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎలాంటి ఆధారాల్లేకుండా వలంటీర్లపై నిందారోపణలు చేసిన పవన్‌కల్యాణ్ వెంటనే వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని ిమాండ్ చేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



ఈఓ, చైర్మన్లకు చీర,సారె అందిస్తున్న మహానంది ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు,మహిళలు

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం పల్లకీలో విహరించారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివారి ఉత్సవం కనులపండుగగా జరిగింది. ముక్కోటి దేవతలకు నిలయమైన గోమాతను విశేషంగా అలంకరించారు. వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజలు చేపట్టిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామి, అమ్మవారిని ఊరేగించారు.

శ్రీ కామేశ్వరీదేవికి చీర, సారె

మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి మహానంది, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో చీర, సారె సమర్పించారు. చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు. ఈ మేరకు మహానంది దర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు భవనాశి రమణయ్య, ఎల్లయ్య, మునగనూరు శ్రీలక్ష్మీ, మహిళా మండలి సభ్యులు వందలాది సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి చీర, సారె అందించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. అలాగే నంద్యాల జిల్లా శ్రీ వాసవి ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షుడు ఇందుమతి, సెక్రటరీ శోభారాణి ఆధ్వర్యంలో మహిళలు ఒడిబియ్యం, సౌభాగ్య ద్రవ్యాలు, పిండి వంటలు సమర్పించారు.

చేతిపంపును పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో మరమ్మతులకు నోచుకోని చేతి పంపును ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్ సోమవారం పరిశీలించారు. ఈ నెల 10న 'నీళ్లుండి నిరుపయోగం' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు గ్రామానికి వెళ్లి ఆ చేతి పంపును పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపట్టారు. 4 రోజుల్లో మరమ్మతులు చేయించి ప్రజలు వినియోగించుకునేలా సిద్ధం చేస్తామని ఏఈ చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, సచివాలయ సిబ్బంది రంజిత్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉపేంద్ర, జనార్దన్ తదితరులు ఉన్నారు.